**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

విజయవాడ,
తేది : 27 ఏప్రిల్, 2023.

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **– జె.జయరాం,** ఆఫీసు కార్యదర్శి

**విషయం :** **ఉపాధి హామీ కూలీల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు, వడదెబ్బతో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకొనుట గురించి ..**

**అర్యా!**

గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేదలకు ప్రధానమైన వనరు. పనులు బాగా కల్పించిన చోట పేదల వలసలు తగ్గాయి. పేదల కొనుగోలు శక్తి పెరిగింది. అంతేగాకుండా చిన్న, సన్నకారు రైతుల భూములు అభివృద్ధి చెందాయి. చెరువు పూడిక తీతల వల్ల భూగర్భ జలాలు పెరిగినట్లు ప్రభుత్వ లెక్కలు తెలియజేస్తున్నాయి. ఉపాధి హామీ చట్టం అంటే గ్రామీణ పేదలకు ఒక వరం లాంటిది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన చట్టానికి కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గించింది. పని ప్రదేశాలలో మౌలిక వసతులు కల్పించడం లేదు. సమ్మర్ అలవెన్సు రద్దు చేసింది. చేసిన పనికి నెలల తరబడి వేతనాలు ఇవ్వడం లేదు. రెండు పూటలా పని చేయించడం వల్ల వడదెబ్బకి అనేక మంది కూలీలు చనిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం తమ బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఉపాధి హామీని సమర్ధవంతంగా అమలు చేయాలని కోరుతున్నాను.

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 8 సంవత్సరాలుగా ఈ పథకానికి ఇవ్వాల్సిన నిధులు సక్రమంగా విడుదల చేయడం లేదు. చట్టం ప్రారంభంలో 90% కూలీల ద్వారా, 10% మెటీరియల్ ద్వారా చెయ్యాలని చట్టం నిర్ణయించింది. ప్రస్తుతం కూలీలకిచ్చే నిధులను భారీగా తగ్గించి మెటీరియల్ వర్క్ 40 శాతానికి పెంచడం వల్ల కూలీలకు భారీగా పనిదినాలు తగ్గిపోయాయి. ఈ కారణంగా కుటుంబానికి 100 రోజులు కల్పించాల్సి ఉండగా మన రాష్ట్రంలో ప్రతి ఏడాది సగటున 50 రోజులకు మించి పని కల్పించడం లేదు. 100 రోజులు చేసిన కుటుంబాలు అయితే 15% మించడం లేదు. ఉదాహరణకు 2020-21లో కేంద్రం కూలీల వేతనాలకు రు.2,592 కోట్లు కేటాయిస్తే, ఈ ఆర్థిక సంవత్సరానికి రు.1500 కోట్లు తగ్గించేసింది. ఈ కారణంగా మన రాష్ట్రంలో సుమారు 32 లక్షల కుటుంబాలకు పని కల్పిస్తే రు.481 కోట్ల రూపాయల వేతనాలు ఇవ్వాల్సి ఉండగా నేటికి రు.273 కోట్లు మాత్రమే చెల్లించారు. ఇంకా రు.208 కోట్లు బకాయిలు ఉన్నాయి. వారం వారం కూలీ చెల్లించాలని చట్టం చెబుతుండగా పూట గడిచే పేదలు నెలల

తరబడి కూలీలు చెల్లించకపోతే వారు ఎలా బతకగలరో మీకు తెలియనిది కాదు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నది. కాబట్టి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఈ పథకం సమర్థవంతంగా పనిచేసేలా నిధులు బకాయిలు విడుదల చేసేలా చూడగలరని కోరుతున్నాను.

మన రాష్ట్రంలో ఫిబ్రవరి – జూన్ వరకు తీవ్రమైన ఎండల కారణంగా 20–30% సమ్మర్ అలవెన్సు ఇచ్చేవారు. ఈ సంవత్సరం రద్దు చేశారు. అదే విధంగా కొలతల ప్రకారం పని నిర్ణయించడం వల్ల పేదలు తెల్లారకముందే పనికి వెళ్ళి ఎండ ఎక్కేలోపు ఇంటికి చేరుకునేవారు. ఈ సంవత్సరం రెండు పూటలా పని చేయాలని నిబంధనలు విధించడం వల్ల అనేక మంది పేదలు వడదెబ్బకు చనిపోతున్నారు.

ఉదా : (1) వెంకటరావు (60సం॥) – మాసంగి గ్రామం, కొత్తూరు మండలం, శ్రీకాకుళం.

(2) దట్టి నూకరాజు (47సం॥) – కోటపాడు గ్రామం, వి.మాడుగుల మండలం, అనకాపల్లి.

(3) చిన్న రామాంజనేయులు (25సం॥) – హొసూరు గ్రామం, పత్తికొండ మండలం, కర్నూలు.

(4) హిమామ్ (50సం॥)– రాయనిపేట గ్రామం, శింగనమల మండలం, అనంతపురం.

(5) కోట జయరాజు (51 సం॥) – కృష్ణారావుపాలెం, ఎ.కొండూరు మండలం, ఎన్‌టిఆర్.

(6) ఎచ్చర్ల పార్వతి (47సం॥) నాగూరు గ్రామం, గరుగుబిల్లి మండలం, పార్వతీపురం మన్యం.

తీవ్రమైన వడదెబ్బను తట్టుకోలేక అక్కడికక్కడ కుప్పకూలి చనిపోయారు.

ఇటువంటివి రాష్ట్రంలో అనేకం ఉన్నాయి. వీరి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం అందక అనాథలవుతున్నాయి. గతంలో పని చేసే చోట ఎండ తీవ్రత నుండి రక్షించడానికి టెంట్లు, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ మొదలగు సౌకర్యాలు కల్పించేవారు. ప్రస్తుతం వీటన్నింటినీ రద్దు చేశారు. వెంటనే ఈ సౌకర్యాలు పునరుద్ధరించాలని కోరుతున్నాను.

ఈ నేపథ్యంలో ఉపాధి హామీ చట్టం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలి. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం తమ బడ్జెట్‌లో కనీసం వెయ్యి కోట్లు కేటాయించాలని, 100 రోజులు చేసిన కుటుంబాలకు అదనంగా 50 రోజులు ఇవ్వాలని, సమ్మర్ అలవెన్సు చెల్లించాలని, పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు, చనిపోయిన వారి కుటుంబాలకు 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, తక్షణమే బకాయిలు ఉన్న కూలీ వేతనాలు చెల్లించాలని కోరుతున్నాను.

అభివందనములతో...

**(వి.శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి